బ్రతుకు బాటను ఎంతగా సరిచేద్దామనుకున్నా అంతగా అవి దూరమవుతూ వచ్చినయి. ఈ విషయంలో నాలో ఏమీ లోపం లేదని చెప్పగలను. అయినా ఎందుకీ సోది. మన యిద్దరి భావాలు యింక కలియవు. రోజూ మనం యిలా యీ చిల్లర విషయాలమీద కొట్ల కుక్కల్లా దెబ్బలాడుకోవలసిందే. ఈ దేశంలో మన సంసారమే గాదు, చాలా సంసారాలు బాధపడుతున్నవి యిలాగే. నువ్వన్నట్టు చాలా మంది అంటారు సంసారాలు చెయ్యలేమని. కాని విడిచివెళ్ళరు. వెళ్ళలేరు. నామట్టుకు నాకే ఎందుకో భయంగా వుంటుంది, ఆ సంగతి తల్చుకుంటే."

"ఏమిటో పిచ్చివాగుడు నాది..."

"దానికేం డబ్బుమాత్రం అప్పుపుట్టదు" రామ్మూర్తి చొక్కా బుజంమీద వేసుకుని యింట్లోనుండి బయటపడ్డాడు తాత్కాలిక శాంతికోసం.

---

ఒక మధుర స్మృతి

# కల కాలేని నిజం

"స్వప్నం"

నేనా ఊరికి కొత్తగా వచ్చాను. అక్కడ నాకు తెలిసినవాళ్లెవరూ లేరు. నా జేబులో ఉండిన కొస్త డబ్బూ తిండి కింద అయిపోయింది. నా ఒంటిమీది దుస్తులు పాతవి, చినిగినవి. అమ్ముకుందుకు పనికిరావు.

ఆకలి, పగలల్లా తిరిగినా ఏకూలీ దొరకలేదు. సాయంత్రం అవుతోంది. ఆకాశం మేఘావృతం. గడ్డు చలికాలం. ఊరి చివరి సంత మార్కెట్టు చేరేను. అంతా నిర్మానుష్యం. వారానికోసారే బజారుంటుంది. కొన్ని పెట్టెకొట్లు తాళం వేసుకు పోయారు ఆసాములు. సంతనాడే మళ్ళా తెరుస్తారవి. వెనక రోజే సంత అవడంవల్ల తుక్కు కుప్పలలో దుకాణాల కింద వెతుకుతున్నాను. పొట్టకు ఏదైనా దొరకదా అని.

నేటి నాగరికతా ప్రపంచంలో కడుపుకు తిండి దొరకడం అతి కష్టం. కాని ఆత్మకు కావలసినంత " ఎక్కడ పడితే అక్కడ రేడియోల ద్వారా, ఉపన్యాస వేదికల ద్వారా, గ్రంథాల ద్వారా, బలవంతంగా కూడా ఆత్మలను నింపడానికి ఎంతోమంది పూనుకుంటారు. మాడుతున్న పొట్టకి ఒ కడి అన్నం వేసేవాడు కనిపించడు. చక్కని బజార్లూ, తీరుగా కట్టిన భవనాలూ, శిలా విగ్రహాలూ, శిల్ప సౌందర్యాన్ని ఆత్మకు తినిపిస్తాయి. నృత్యము సంగీతము అమృత సమమగు కళాసవమును అందిస్తాయి. వెలలేని అందమైన దుస్తులు ధరించిన రసికులు, దూరంగా దరిద్రుని కళ్లకు ఆనందం కూరుస్తూ తిరగాడుతారు. ఇంత సులువుగా ఆత్మకు ఆహారము దొరుకుతూ ఉంటే కాలెడి పొట్టకు ఓ మెతుకు కూడ హుళక్కి. ఈ విపరీతము మానవులకో గుణపాఠం నేర్పదూ?

చీకటి పడుతోంది. గాలి తుఫానుగా మారుతోంది. చినుకులు పడుతున్నాయి. పెద్ద పట్టణపు పరిసరమైనా, ఆ స్థలం సహారా ఎడారి. దూరంగా వినబడే శబ్దాలు మాత్రమే పట్టణమున్నట్టు తెలియడానికి ఆధారము. తల దాచుకొందు కాస్కారము కనపడడము లేదు, ఓ పాడు గుడిశె తప్ప. చలివేంద్రమేమో - వేసవి వరకూ దానిజోలి కెవరూ పోరు.

ఆకలి దహించుకు పోతోంది. నా అవస్థ చూచి, భరించలేనన్నట్లు ఆకాశం కన్నీటి ధారలను వదలటం ప్రారంభించింది. నన్నోదార్చడానికి కాబోలు, వాయుదేవుడు నా అవయవాలను గాఢంగా కౌగిలించుకుంటున్నాడు. నా మీద కనికరంచే కాబోలు చీకటి నాకు వసనంగా మారిపోయింది.

నాకప్పుడు పద్ధెనిమిదిసంవత్సరాలు. చనిపోవడానికి చక్కని ప్రాయము. అంతలో దగ్గరలో ఓ శబ్దం వినిపించింది. ఏదో మూలుగు; విసుగు; లాగుతున్నట్టేదో... ప్రాణం లేచివచ్చింది. ఆ ఎడారిలో నాలాటి దీనుడెవడో...ఆ వైపు

నాలుగడుగులు వేశాను. ఓ దుకాణం క్రింద చెత్తలో కెలుకుతున్నారెవరో. చప్పుడు కాకుండా సమీపించి, "ఎవరు" అన్నాను. భయంతో వొణికిపోతూ నా ముఖంలోకి ఆ మసక చీకట్లో తొంగి చూచింది ఓ యువతి. సమవయస్క. ఏమనుకుందో, ఎట్లు పసికట్టిందో? "తిండికోసమేనా? రా వెతుకు" అంది మెల్లగా.

నా తలలోని నీతిశాస్త్రమూ. శిక్షాస్మృతీ, ఇత్యాది సాంఘిక నియమాలన్నీ ఆ క్షణంలో యెక్కడకు పోయాయో? ఒక్కటే ఆలోచన మిగిలింది. ఆమెకు సహాయపడటమే, ఆవానలో తడిసిన గుడ్డలతో.

ఇంతలో "ఏంలాభం? ఈ వెతకటం. పెట్టెలోకి మార్గం ఆలోచించాలి. చూడూ! ఆ కప్పు తాళం" అంది ఆమె. ఆడంగుల బుద్ధి పెడబుద్ధి అంటారు. ఒక్కొక్కప్పుడు వారికి కూడా చక్కని ఆలోచనలు తోస్తాయి. అట్లాంటివి అమలుపరచటం నాకు సరదా. వెంటనే నిలబడి కప్పు పరీక్షించాను. చాల అలగా కప్పు. బలంగా లాగేసరికి ఊడిపడింది.

చెంగున అమ్మాయి కొట్లోదూరి చీకట్లో తడవుతోంది. విసుక్కుంటోంది. చివరికి కొన్ని మాగిన అరటిపళ్లూ, సగం కుళ్ళిన జత కొబ్బరి కాయలూ దొరికాయి. అమృతప్రాయంగా పంచుకు తినసాగేము.

"ఏదో కాలే కడుపుకింత. పడకో? అబ్బా, చలి! ఏం వర్షం!" అంటూ విలపిస్తోంది. "దగ్గరలో ఓ గుడిసె ఉంది" పద అన్నాను. నేను ముందు, వెనకాలే ఆమె సాగిపోయాం.

చిన్న గుడిసె. ఒకటే గది ఓ మూల గడ్డిమోపు. రంధ్రాల్లోంచి ఈదురగాలి. కప్పు చిల్లులలోంచి వర్షపు చినుకులు. ఓమూల చుట్ట చుట్టుకు, మోకాళ్ళమీద తల ఆనించి ఆమె. మరో మూల అదే స్థితిలో నేను. ఆమె కళ్లు నిప్పుకణాల్లాగ మెరుస్తున్నాయి. స్థాణువువలె నిశ్చలంగా కూచున్న ఆమెను చూస్తుంటే నాకు భయంవేసింది. మాట్లాడబోతిని కాని ఏం మాటాడాలో పాలుపోలేదు.

ఆమె ప్రారంభించింది.

"ఏం పాడుబతుకు!" నిశితంగా ఓ తీర్మానానికి వచ్చినదానిలా. అదో ఫిర్యాదు కాదు. దానిలో ఎంతో నిర్లక్ష్యం ఉంది. తన శక్తి కొలది ఓ వ్యక్తి ఆత్మసంశోధన మొనర్చుకొని తన నికృష్ట జీవితమును నిలబెట్టుకొనుటకు మరణం వినా మరొక మార్గము లేదని నిశ్చయించుకుంది.

ఇటువంటి హేతుబద్ధపు టాలోచన నాకు కలవరపాటు కలిగించింది. మాట్లాడకున్న దుఃఖ మాగేటట్లు లేదు. స్త్రీ ఎదుట, విలపింపని స్త్రీ ఎదుట, పురుషుడేడవటమా? ఏమీ తోచక ఆ స్థితి కెట్లా దిగజారిందో అని అడిగాను.

ఆమె: "నా పేరు సుశీల. ఫ్యాక్టరీలో కూలి చేసుకుని బతుకుతున్నాను. నా అనేవారెవరూ లేరు. కల్లుకొట్టు అప్పడు నన్ను చేరదీశాడు. సరదాగా కొన్నాళ్లు దొర్లాయి. నా అందం ఇతరులు కోరడం మొదలెట్టారు. వారిచ్చిన డబ్బూ, దక్కుతూ అప్పడికిచ్చేదాన్ని. వాడంటే నాకదో ఇది.

"ఇంతలో అప్పడు ఇతర స్త్రీలను మరుగుతున్నాడని తెలిసింది. నేను చూడనిదానికి నాకేమని నేనంతగా పట్టించుకోలేదు. కాని నిన్ననొక ఒయ్యారిభామతో సరసాలాడుతూ నా కంటపడ్డాడు. నన్ను చూసి నవ్వుతూ, దానితో పరియాచికాలాడతూనే ఉన్నాడు. నాకు వెర్రి కోపం వచ్చింది. చెడమడ తిట్టాను. తప్ప తాగి ఉన్నాడేమో, నన్ను చావబాదాడు. నా కొత్త కోకా, జాకెట్టూ, ఎలా చించాడో? వొంటిమీద గాయాలు, నౌకరీకి యెలా వెళ్ళడం?"- (ఓ కేక పెట్టింది)

చలి హెచ్చింది. గాలి రొద పెరిగింది. నా దంతాలు గజగజ వణుకుతున్నాయి. ఆమె నా దగ్గరగా జరిగింది.

"మీ మగాళ్లెంతటి దుర్మార్గులు! కాలితో నేలరాసి చిత్రవధ చేసినా పాపంలేదు. మీలో ఎవరేనా చస్తే వాడి పాడు మొహంమీద కాండ్రించి ఉమ్మేస్తాను. కనికరించను. వెధవలు బతిమిలాడి, బతిమిలాడి ఊరకుక్కల్లాగ తోకలాడిస్తూ చుట్టూ తిరుగుతారు. ఓ బుద్ధిహీన దగ్గరికి రానిస్తుంది. దాన్తో సర్వనాశనం. ఆ అమ్మాయిని కాలికింద నలిపేస్తాడు. ఛీ, చీడపురుగులు."

తడుపుకోకుండా తిడ్తోంది. ఆ తిట్లలో క్రౌర్యములేదు. కసిలేదు. ఆ ఛీడపురుగులమీద ద్వేషము లేదు. మాటల ఉచ్చారణ అతి సౌమ్యమూ కర్కశహీనమూను.

మృతియొక్క చక్కని వర్ణనకంటె మరణించుచున్న వాని మరణవేదన ఎక్కువ స్వాభావికంగా ఉంటుంది. నామనస్సు కామెమాట లెక్కినట్లు నేను చదివిన ఏ పుస్తకములోని మాటలూ యెక్కలేదీనాటికీ.

సుశీల మాటలు కాదు కాని, చలి నాకు బాధగా ఉండి నెమ్మదిగా మూలిగాను. పళ్లు కొరుక్కున్నాను.

అదే సమయంలో రెండు చల్లని చేతులు— ఒకటి నా మెడనీ, రెండవది ముఖాన్నీ తాకినయ్. దాన్తోకలిసి మెల్లగా బుజ్జగింపుగా ఈ ప్రశ్న: "ఎందు కీబాధ?"

మగాళ్ళని దుమ్మెత్తి పోస్తున్న ఆమెకొక, ఇంకొకరు నన్ను పలకరిస్తున్నా రనుకున్నాను. కాని తొందరగా, చురుగ్గా సుశీల! "...ఏమిటీ చలితో గడ్డకట్టిపోతున్నావా? అయ్యో, పిచ్చివాడివి. గుడ్లగూబలాగ ఉలక్క పలక్క చూచోకపోతే వొణికిపోతున్నానని చెప్ప రాదూ? అలా దగ్గరగా రా, చేతులు మీద వెయ్యి. ఒకర్నొకొకరం పట్టుకు కూచుంటే రాత్రి గడపవొచ్చు. తప్పు తాగావా? నౌకరీ వూడిందా? ఫర్వాలేదులే..."

ఆమె నన్నోదారుస్తోంది. నాకు ధైర్యమిస్తోంది.

ఎంత విపరీతం? ఆలోచించండి. నేనా రోజుల్లో మానవుని గమ్యాన్ని గూర్చి గాఢంగా ఆలోచిస్తూ సంఘ సంస్కరణనుగూర్చిన కలలు కంటూ, రాజకీయ సంక్షోభాల నూహిస్తూ, రచయితలకే అతీత భావాలు కల పుస్తకాలు చదువుతూ, ఒక విప్లవసంస్థా నిర్మాణంలో మునిగివున్నా. జీవించటానికి నాకు గల హక్కునుగూర్చి అంతఃసమాధానానికి వచ్చివున్నాను. ప్రపంచంలో చరిత్రాత్మకమయిన పాత్రను నిర్వహించటానికి సమర్థుడ ననుకొంటున్న రోజులవి.

ఇప్పుడొక పతిత, ఒక నిర్భాగ్య చరిత, జీవితంలో స్థానం లేక ఎందుకు కొరగానిది, నాకు తన శరీరముతో వేడినిస్తున్నది. నన్నోదారుస్తున్నది. ఆమె నాకు సాయం చేయక ముందు నేనామెకు ఎవ్విధమైన సాయమూ చేయనూహించనైన లేదు. అట్టి వుద్దేశమేదైన వున్నా నేనామెకు ఎవ్విధమైన సాయము చేసే స్థితిలో లేకుంటిని.

ఇదంతా కలలో జరిగిందేమో. నిద్రమత్తులోని సంఘటనేమో, అని ఊహించుకోవటానికి సిద్ధపడ్డాను.

అబ్బా, అలా అనుకోడం అసాధ్యము. చల్లని వానచినుకులు నామీద పడుతున్నా యాయె వెచ్చని స్త్రీదేహం నన్ను అంటివున్నది. (కల్లు కంపు ముమ్మర మయినా) పైపెచ్చు చలి! వర్షము గుడిసెని పీడిస్తోంది. ఎంత ప్రయత్నించినా వొణకడం తప్పలేదు. ఇదంతా వాస్తవమే. ఎవరైనా ఇలాంటి భయంకర స్వప్నం కంటారని నమ్మలేను.

ముద్దుగా ప్రేమ చిప్పిలుతూ మాట్లాడుతూనే ఉంది సుశీల. స్త్రీయే ఆ విధంగా మాటాడగలదు. కరుణామయమైన ఆమాటల ప్రాబల్యం వలన నాలో ఓచిచ్చు రేగి నాలో ఏదో కరిగిపోయింది.

వడగళ్ల వలె కన్నీరు నా కళ్ళలోని ధారాపాతంగా ప్రవహించింది. నా హృదయంలోని తెలివితక్కువ, మాలిన్యం, అసహనం, ఆవేదన, క్షాళితమయిపోయాయి, సుశీల సముదాయింపు మాటలు మాట్లాడుతూనే ఉంది.

"అబ్బాయీ, ఏడవకు. ఊరుకో- భగవంతుని కృపవలన నీవు వృద్ధిలోకి వస్తావు. మరొక నౌకరీ దొరుకుతుంది..."

ఇంకా నన్ను వదలకుండాబుజ్జగిస్తూనే ఉంది.

* * *

సూర్యోదయమయాక ఎవరి దారిని వారము ఊళ్లోకి పోయాము; ఆప్త స్నేహితుల వలె వీడ్కోలిచ్చుకుని. అంతే. తర్వాత మరెప్పుడూ సుశీల కలుసుకోలేదు. అందుకొఱకై చేసిన నా ప్రయత్నం ఫలవంతం కాలేదు. నేనెంత వృద్ధిలోనికి వచ్చినా, అమృతమూర్తిని మరవలేను. ఆ మాతృవాత్సల్యము నేనిక చవిజూడబోను.

(ఆధారం: గోర్కీ.)